

# ఇల్లు కట్టుకుంటారా.. డబ్బులిచ్చేస్తారా..?

- ఇళ్ల లబ్ధిదారులకు నోటీసులు
- గతంలో నిర్మాణాలకు అడ్వాన్స్‌లు చెల్లింపు
- ప్రస్తుతం రికవరీకి అధికారుల చర్యలు
- కాంట్రాక్టర్లకు కూడా తాఖీదులు
- గిట్టుబాటు కాదంటున్న కాంట్రాక్టర్లు
- అమ్మకానికి ఇళ్ల స్థలాలు
- రంగంలో దిగిన దళారులు

**ప్రధానమంత్రి ఆవాస యోజనలో నాటి వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు లబ్ధిదారులకు శాపంగా మారాయి. పట్టణ ప్రాంత పేదలకు దూరంగా లోతట్టు ప్రాంతంలో స్థలం కేటాయించడంతో ఇంటి నిర్మాణానికి వెనుకంజ వేశారు. కొంత మందికి ప్రభుత్వం అడ్వాన్స్‌లు చెల్లిస్తే మరికొన్ని నిర్మాణాలు కాంట్రాక్టర్లకు అప్పగించారు. తాజాగా ఇళ్లు నిర్మించుకోండి లేకుంటే అడ్వాన్స్‌లు తిరిగిచ్చేయండి అంటూ అధికారులు లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నారు. మరోవైపు కాంట్రాక్టర్లకు కూడా తాఖీదులు ఇచ్చినా తమకు గిట్టుబాటు కాదంటూ బేఖాతరు అంటున్నారు.**

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేదని లబ్ధిదారులు, వైసీపీ నేతల అశీస్సులతో స్థలాలు పొందిన అనుచరులు ఇళ్లు నిర్మించుకోలేదు. వారిపై గృహ నిర్మాణ శాఖ కొరడా ఝుళిపిస్తోంది. ఇళ్లు కట్టుకుంటారా లేదంటే ప్రభుత్వం ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి చెల్లిస్తారా అంటూ లబ్ధిదారులను వెంటాడుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 1487 మంది లబ్ధిదారులు గత ప్రభుత్వంలో అడ్వాన్స్ తీసుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. ప్రభుత్వం రూ. 2.87 కోట్లు అడ్వాన్స్ అప్పట్లో చెల్లించింది. ఆ సొమ్ముల రికవరీకి గృహ నిర్మాణ అధికారులు రంగంలో దిగారు. ఇంటి నిర్మాణం చేపడితే సరేసరి.. లేదంటే రికవరీ చేసేందుకే అధికారులు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో అడ్వాన్స్ తీసుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

### కాంట్రాక్టర్లకు తాఖీదు

వైసీపీ హయాంలో మంజూరు చేసిన ఇళ్లలో 3 కేటగిరీలుగా విభజించారు. లబ్ధిదారులు నిర్మించుకోలేని పక్షంలో ప్రభుత్వమే నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చింది. కాంట్రాక్టర్లను నియమించింది. జిల్లాలో 6700 ఇళ్లకు సంబంధించి కాంట్రాక్టర్లకు గతంలో అడ్వాన్స్‌లు కూడా చెల్లించారు. ముగ్గురు కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మించకుండా ముఖం చాటేశారు. అడ్వాన్స్ తీసుకున్న కాంట్రాక్టర్లకు అధికారులు నోటీసులు జారీ చేసినా బేఖాతరు అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోవని కాంట్రాక్టర్లు వెనకడుగు వేశారు. వారందరికి ప్రస్తుతం నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో క్రిమినల్ కేసులు నమోదుకు అధికారులు సిద్ధపడుతున్నారు

### చేతులు మారుతున్న స్థలాలు

పట్టణ లబ్ధిదారులకు మంజూరు చేసిన స్థలాలు విక్రయించేస్తున్నారు. దళారులు రంగప్రవేశంతో స్థలాలు చేతులు మారుతున్నాయి. ప్రభుత్వం భవిష్యత్‌లో ఇళ్లను విక్రయించుకునే వెసులుబాటు కల్పించడంతో గతంలో మంజూరైన స్థలాలను విక్రయించేందుకు లబ్ధిదారులు మొగ్గుచూపుతున్నారు. ఇంటి నిర్మాణ సామర్థ్యం లేనివారు విక్రయిస్తున్నారు.

# టిడ్కో ఇళ్లు ఇవ్వండి..!

- నిర్మాణంపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఏడాదిగా చర్యలు చేపట్టని కూటమి
- బలహీన పడుతున్న నిర్మాణాలు
- ఫ్లాట్లకోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

తణుకు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు నిర్మాణం పూర్తయిన టిడ్కో గృహాలను తర్వాత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాలనలో లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించలేదు. టిడ్కో గృహసముదాయ భవనాలు పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కూడా ఏడాది కాలంలో మిగిలిన కొద్దిపాటి పనులపై దృష్టి సారించలేదు.

టిడ్కో భవన సముదాయ నిర్మాణాలను ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేయడంతో నివాసానికి ఉపయోగపడతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇనుప ఊచలు పైకి అలానే ఉన్నాయి. ప్లాట్లు లోపల కూడా బీటలు వారాయి. ఇప్పటికే డబ్బు చెల్లించిన లబ్ధిదారులు ఇళ్ల కోసం ఇంకెంత కాలం వేచి చూడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దె ఇంట్లో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.



### కాంట్రాక్టరు రావాల్సి ఉంది

ప్రభుత్వం కాంట్రాక్టరుకు పనులు అప్పగించింది. తొందర్లోనే కాంట్రాక్టరు పనులు చేపడతారు. లబ్ధిదారుల బ్యాంకు రుణాలపై వడ్డీ ప్రభుత్వం చెల్లిస్తుంది. తొందర్లోనే ప్లాట్లు పూర్తి చేయడం జరుగుతుంది.

**టి.రామ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్**



### ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు

ప్లాటు కేటాయించినపుడు ప్రభుత్వానికి రూ.75వేలు డీడీ చెల్లించాం. రుణం వచ్చినప్పటికీ ఇల్లు మాత్రం అప్పగించ లేదు. అధికారులు, బ్యాంకులో సరైన సమాధానం చెప్పడం లేదు. మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే పరిష్కారం చేసి ప్లాట్లు ఇవ్వాలి.

**వి.లలిత, లబ్ధిదారు**

### అద్దె ఇంట్లో తప్పని తిప్పలు

చాలా వరకు నిర్మాణం పూర్తయినా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఇల్లు అప్పగించ లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. డబ్బులు కట్టాలని బ్యాంకు నుంచి ఒత్తిడి చేసేవారు. అద్దె ఇంట్లో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరగా ఫ్లాట్ అప్పగించాలి.

**కె.అనిత, లబ్ధిదారు**



## చిత్రం చెప్పిన కథలు



### నీటి ఎద్దడికి అద్దం

ఓ వైపు రోజు రోజుకు పెరుగుతున్న ఉక్కబోత, వేడిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి.. మరోవైపు వేసవిని మించి పొడి వాతావరణంతో వరి సాగుకు నీటి ఎద్దడితో రైతులు అల్లాడుతున్నారు. ఆచంట మండలంలో సార్వా సాగుకు కొన్ని చోట్ల నీటి ఇబ్బందులతో నాట్లు నత్తనడక సాగుతున్నాయి. నాట్లు వేసిన భూములకు సైతం బోరు ద్వారా నీటిని తోడుతున్నారు. ఆగస్టులో ఈ పరిస్థితి రావడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆచంటలో చేలకు మోటార్‌తో నీరు తోడుతున్న దృశ్యం.. నీటి ఎద్దడికి అద్దం పడుతోంది.

- ఆచంట(ఆంధ్రజ్యోతి):



### రేవుల్లో చెత్త కుప్పలు

తాగు, సాగు నీరందించే కాలువలను ప్రజలు చెత్త కుప్పలు చేసేశారు. మిడ్ లెవెల్ కాలువ తణుకు, పెంటపాడు, ఉంగుటూరు మండలాల్లోని ముద్దాపురం, అలంపురం, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు, పెంటపాడు, బొమ్మిడి తదితర గ్రామాలకు సాగు, తాగు నీరందిస్తుంది. రాచర్లలో కాలువ రేవు చెత్తతో నిండిపోయి కనీసం దిగడానికి ఆస్కారం లేకుండా వుంది. రేవులో చెత్త వేయకూడదని అధికారులు బోర్డులు పెట్టినా ప్రజలు పట్టించుకోవడం లేదు. కొందరు మరింత దారుణంగా మరుగుదొడ్డి జలాల పైపులను కాలువలో పెడుతున్నారు. రాచర్లలో చెత్త కుప్పలా దర్శనమిస్తున్న మిడ్ లెవెల్ కాలువ రేవును చూడండి.. మీకే అర్థమవుతుంది.

- పెంటపాడు(ఆంధ్రజ్యోతి):



### చెరువుకు మోక్షం కలిగించేలా..

గొల్లలకోడేరు గ్రామ నడిబొడ్డున బ్రాహ్మణచెరువు, హరిజనపేటకు చేర్చి ఉన్న మరో చెరువులు చిట్టడవిని తలపించేలా కిక్కిసతో నిండిపోయాయి. ఈ రెండు చెరువులను బాగు చేయించాలని స్థానికులు గగ్గోలు పెట్టారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలతో స్థానిక టీడీపీ నాయకుడు దాతల సహకారంతో చెరువులు తవ్వకం పనులు ప్రారంభించారు. పంచాయతీ పాలకులు దీనిని అడ్డుకోవడంతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దృష్టికి వెళ్లడంతో దగ్గరుండి పనులు ప్రారంభించారు. చెరువులను అభివృద్ధి చేసి తాగునీటి అవసరాలకు ఉపయోగించాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో అభివృద్ధి పనుల్లో నిమగ్నమయ్యారు.

- పాలకోడేరు(ఆంధ్రజ్యోతి):



### ఈ వంతెనపై ప్రయాణమంటే..

కాకిలేరు, కంతేరు గ్రామాల నుంచి పెనుగొండ రాకపోకలకు అనువుగా నరసాపురం కాలువపై వున్న వంతెన వాహనదారులను భయపెడుతోంది. రహదారి నుంచి వంతెనపైకి చేరడంలో అదుపు తప్పితే 15 అడుగుల కిందికి పడిపోవాల్సిందే. ఇక్కడ రహదారికి ఇరు వైపులా సైడ్ వాల్స్ కానీ, హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో ఇటీవల భార్యభర్తలు బైక్‌పై వెళుతూ రాత్రి వేళ దారి కనపడక వంతెనపై నుంచి కిందికి పడిపోయారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వంతెన సమీపంలో రోడ్డుకు సైడ్ వాల్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

- పెనుగొండ(ఆంధ్రజ్యోతి):





### ఆకివీడు బస్టాండ్‌లో దాహం..

ఆకివీడు ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో నీరు రాక మూడు రోజులుగా ప్రయాణికులు తాగేందుకు, మరుగుదొడ్ల వినియోగానికి ఇబ్బందులు పడుతున్నారు. పైపులు పాడయ్యాయని, మరమ్మతులకు మరో మూడు రోజులు సమయం పడుతుందని చెబుతున్నారు. నీరు లేక మరుగుదొడ్లు అధ్వాన్నంగా మారాయి. కంట్రోలర్ లేక రాత్రి పగలు బస్టాండ్ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.

- ఆకివీడు(ఆంధ్రజ్యోతి) :



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి వర్మ

# భీమవరం-తాడేపల్లిగూడెం గ్రీన్ ఫీల్డ్ హైవే

- త్వరలో డీపీఆర్ సిద్ధం
- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లోసరి నుంచి పిప్పర వరకు సీఆర్ఎఫ్ నిధులు రూ.100 కోట్లతో రోడ్డు నిర్మాణంతోపాటు తాడేపల్లిగూడెం నుంచి భీమవరం గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి ప్రతిపాదనలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆయన పుట్టినరోజు వేడుక అనంతరం విలేకరులతో మాట్లాడారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంపై త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేసి అనుమతులు సాధిస్తామని తెలిపారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరిధిలో 4 ఫ్లైఓవర్లు మంజూరు చేయించానని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపడతారని వర్మ తెలిపారు. భీమవరం పట్టణంలో కోడపల్లి రోడ్డు, బైపాస్ రోడ్డు, కాస్మో క్లబ్ రోడ్డులో ఉన్న రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేస్తామని శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఎన్‌హెచ్ 165 గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి 2,500కోట్లు మంజూరు చేసిన కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి చిత్రపటానికి శ్రీనివాస్ వర్మ, బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, నార్ని తాతాజీ, నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుబాష్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కలిదిండి వినోద్ వర్మ, తోట గంగరాజు, శరణాల మారుతీరాణి, జిల్లా ఉపాధ్యక్షుడు కాగిత సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు

అధికారులతో జేసీ సమీక్ష

భీమవరం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 15న 79వ స్వాతంత్ర్య వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వేదిక అలంకరణ, శానిటేషన్, తాగునీటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు వినూత్నంగా ఉండాలని వారికి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎక్కడా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వాడకూడదన్నారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, సీపీవో కె.శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో.. నన్నయా..!

## యూనివర్సిటీ క్యాంపస్‌లో చదివితే.. సర్టిఫికెట్ చెల్లదా..?

- 2019-22 మధ్య బీ ఫార్మసీ విద్యార్థులకు షాక్
- కోర్సుకు ఫార్మసీ కౌన్సిల్ అనుమతి లేదు
- చదువు పూర్తి చేసినా ఉపాధి లేదు
- ఉన్నత విద్యావకాశాలు లేవు
- విద్యార్థులు, తల్లిదండ్రుల గగ్గోలు

**ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో బీ ఫార్మసీ చేసిన విద్యార్థుల సర్టిఫికెట్లు చెల్లవని తేలడంతో తెల్లబోయారు. నాలుగేళ్లపాటు చదివిన చదువు నిరర్థకమని వారంతా గగ్గోలు పెడుతున్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ యూనివర్సిటీ కోర్సులో ఎలా ప్రవేశం కల్పించారని విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు.**



పాస్‌అవుట్ అయి బయటకు వచ్చిన విద్యార్థులు ఈ దయనీయ స్థితిలో ఉన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆ విద్యార్థులంతా ఎన్నో ఆశలతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో ఫార్మసీ కోర్సు డిగ్రీ చేశారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులైనా సర్టిఫికెట్స్ చెల్లవని తేలడంతో విద్యార్థులు హతాశులయ్యారు. క్యాంపస్‌లో ఫార్మసీ కోర్స్‌కు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతి పొందలేదు. దీనితో సర్టిఫికెట్ చిత్తు కాగితంగా మిగిలింది. చదివు పూర్తిచేసి రెండేళ్లయినా ఆ సర్టిఫికట్‌తో ఏ ప్రభుత్వ సంస్థలో చేరాలన్న, మందుల దుకాణం పెట్టుకోవాలన్న ఉపయోగం లేకుండా పోయింది. నాలుగేళ్ల పాటు ఉపయోగం లేని చదువు చదివామని ఆవేదన చెందుతున్నారు. 2019 నుంచి వరుసగా 4 సంవత్సరాలు

### 120 మంది భవిష్యత్ ప్రశ్నార్థకం

నన్నయ్య విశ్వవిద్యాలయంలో 2019 నుంచి 2022 మధ్య బీ ఫార్మసీ పూర్తిచేసి బయటకు వచ్చిన 120 మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి ఆ సర్టిఫికెట్‌లు అనుమతి కోసం పడిగాపులు తప్పడంలేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

### పీసీఐ అనుమతి కోసం చూస్తున్నాం



ఫార్మసి కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతి కోసం లేఖ రాశాం. 2023 నుంచి అనుమతి లభించినా గతంలో పాస్ అవుట్ అయిన విద్యార్థులకు ఇంకా అనుమతి లభించలేదు. పీసీఐ నుంచి ఈ సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాం.

**టి.అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్, నన్నయ క్యాంపస్**





ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ నయీం అస్మి

# నిర్ణీత గడువులో సమస్యలు పరిష్కరించాలి

భీమవరం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 191 అర్జీలను స్వీకరించినట్లు ఆయన తెలిపారు. అధికారులు ప్రత్యేక పర్యవేక్షణతో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు.

- తన పెద్ద కుమారుడు భోగరాజు నా ఇంటిని కోడలు పేరున బలవంతంగా రాయించుకొని తనను ఇంటి నుంచి గెంటేశాడని కాళ్ల మండలం బొండాడ పేటకు చెందిన అరిటాకుల లక్ష్మి అధికారుల వద్ద వాపోయింది. తనకు ఆధారం లేదని, కొడుకుపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేసింది.
- తనకు చెవులు వినపడవని సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే వెన్నెముక సమస్యతో సర్టిఫికెట్ ఇచ్చారని పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన కోరాడ గణేష్ నాగ శివకుమార్ వాపోయాడు. ఆ సర్టిఫికెట్ రద్దు చేసి తన సమస్యపై సర్టిఫికెట్ ఇవ్వాలని అధికారులను కోరాడు.

### పోలీసులకు 11 అర్జీలు

భీమవరం క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి 11 అర్జీలను స్వీకరించారు. పూర్తిస్థాయి విచారణ జరిపి శాశ్వత పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో సూచనలు ఇచ్చారు. ఏఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# త్రిసభ్య కమిటీల గడువు పెంపు

- జనవరి 30 వరకు బాధ్యతలు
- 53 సొసైటీల్లో కమిటీలు
- 64 చోట్ల పర్సన్ ఇన్‌చార్జులు
- కమిటీల కోసం కసరత్తు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాల త్రిసభ్య కమిటీల పదవీ కాలాన్ని ప్రభుత్వం పెంచింది. జిల్లాలో ఇటీవల ప్రకటించిన త్రిసభ్య కమిటీల గడువు జూలై 30న ముగిసింది. వాస్తవానికి ఆరు నెలల కాలానికి కమిటీలు వేయాలి. పర్సన్ ఇన్‌చార్జ్‌ల స్థానంలో కమిటీలను వేశారు. గతంలో పర్సన్ ఇన్‌చార్జ్‌ల గడువును జూలై 30 వరకు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడువు ముగియక ముందే వారి స్థానంలో త్రిసభ్య కమిటీలను నియమించారు. పాలకొల్లు, తణుకు, ఆచంట నియోజకవర్గాల్లో సహకార సంఘాలకు కమిటీలు ఏర్పాటయ్యాయి. గడువు ముగియడంతో సదరు త్రిసభ్య కమిటీల కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడిగించింది. జనవరి 31 వరకు త్రిసభ్య కమిటీలు కొనసాగనున్నాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఉండి నియోజకవర్గాల్లో 64 సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు బాధ్యతలు వహిస్తున్నారు. వారి గడువు కూడా జూలై 30 ముగియడంతో మరో ఆరు నెలలు కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ లోపు 64 సంఘాలకు కూడా త్రిసభ్య కమిటీలను ప్రకటిస్తే ఆ కమిటీలు జనవరి 31వరకు కొనసాగనున్నాయి.

### కమిటీల ఏర్పాటుపై దృష్టి

పర్సన్ ఇన్‌చార్జ్‌ల స్థానంలో త్రిసభ్య కమిటీలు నియమించేందుకు కసరత్తు

మిగతా 8వ పేజీలో..


**ఉల్లి ధర తగ్గనుంది?**
సిద్ధంగా ఉన్న కర్నూలు ఉల్లి
మరో పది రోజుల్లో మార్కెట్‌కు..

**పండ్లు, పూల ధరకు రెక్కలు**
మార్కెట్‌కు శ్రావణ ప్రభావం

**చిక్కని చేప**
వేటకు ఎండ దెబ్బ
వరదొచ్చినా వర్షాలు లేవు
వేసవిని తలపిస్తున్న ఎండలు
6



గణపవరంలో సీతాఫలాలు విక్రయిస్తున్న వ్యాపారి

# సీతాఫలాలొచ్చేశాయ్..

**పుష్కలంగా ఔషధాలు**

**ఆరోగ్యానికి మేలు**

**సీజన్‌కు ముందుగానే మార్కెట్‌లోకి..**



గణపవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తొందరపడి ఓ కోయిల ముందే కూసింది అన్న చందంగా సీజన్ ముందుగానే సీతాఫలాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. సీజనల్‌గా లభించే పండ్లలో సీతాఫలాలకు ప్రత్యేకస్థానం ఉంది. సాధారణంగా వర్షాకాలంలో శ్రావణమాసం, వినాయకచవితి నుంచి సీతాఫలాలు మార్కెట్‌లో సందడి చేస్తాయి. సీజన్‌కు ముందుగానే మార్కెలోకి దర్శన మివ్వడంతో కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. చిన్నారుల నుంచి పెద్దవారు వరకు సీతాఫలం అంటే ఎంతో ఇష్టపడతారు.ఈ పండులో రుచితో పాటు పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఆరోగ్యం ఫలంగా పేరొందిన సీతా ఫలాలు వర్షాలు సమృద్ధిగా పడే కాలంలో అధికంగా లభిస్తాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, రాజమండ్రి, ఏలూరు జిల్లా మెట్ట ప్రాంతాలు, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి పుష్కలంగా లభించే ఈ సీతాఫలాలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో అధికంగా విక్రయిస్తున్నారు. గణపవరం మార్కెట్ బొబ్బిలి వంతెన వద్ద భీమవరం తాడేపల్లి గూడెం, ఏలూరు, రహదారుల వెంబడి ఈ సీతాఫలాల విక్రయాలు సాగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఈ సీతాఫలాలు రుచిలో సిమ్లా యాపిల్‌ను మరిపిస్తాయి. ధర కూడా ఎక్కువగానే ఉంటుంది.గుజ్జు ఎక్కువ, గింజ తక్కువగా ఉంటుంది. మెట్ట ప్రాంత సీతాఫలాలు అయితే గింజ ఎక్కువ, గుజ్జు తక్కువగా ఉంటాయి. అందుకే వినియోగ దారులు తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన సీతా ఫలాల పైనే మక్కువ చూపుతున్నారు. ఒకప్పుడు విస్తారంగా సీతాఫలాల తోటలు అధికంగా ఉండేవి. జాతీయ రహదారుల పక్కన సీతాఫలాల తోటలుండేవి. అయితే ప్రస్తుతం రియల్ ఎస్టేట్ పుణ్యమా అంటూ తోటలు తగ్గిపోయి మెట్ట ప్రాంతాల్లో కూడా సీతాఫలాల తోటలు తగ్గుముఖం పట్టడంతో పండ్లకు డిమాండ్ ఏర్పడింది. మార్కెట్‌లో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఇవి పుష్కలంగా లభిస్తాయి. గణపవరంలో చిరు వ్యాపారులు ఎన్నో సంవత్సరాలు తరబడి సీతాఫలాల విక్రయాల ద్వారా స్థానికంగా జీవనోపాధి పొందుతున్నారు. మెట్ట ప్రాంతం, ఏజెన్సీ, తూర్పుగోదావరి రాజానగరంలో లభిస్తున్న సీతాఫలాలు కొనుగోలు చేసి ఇక్కడ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం సీతాఫలాలు డజను రూ.150 - 250 వరకు సైజును బట్టి విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడ సీతాఫలాలు కొనుగోలు చేసి హైదరా బాదు, చెన్నై, ముంబయి వంటి ప్రాంతాలకు బస్సుల మీద కూడా బంధువులకు, స్నేహితులకు పంపిస్తున్నారు.

### ఆరోగ్యానికి దివ్య ఔషధం



సీతాఫలాల్లో సీ విటమిన్‌తో పాటు ఏ, బీ, కే విటమిన్లు, ప్రోటీన్లు, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీ షియం, పొటాషియం, ఐరెన్ వంటి మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. మానసిక స్థితి నియం త్రణలో సహాయపడుతుంది. మెదడును బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెంపొందిస్తుంది. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకుంటే శరీరానికి కావల్సిన శక్తిని కూడా అందిస్తుంది. ముఖ్యంగా ఈ సీజన్‌లో సీతా ఫలాలు తింటే రోగాల బారినపడకుండా రక్షిస్తుంది. రక్తపోటు అదుపులో ఉంచుతుంది. జీర్ణవ్యవస్థను కాపాడుతుంది. రక్తహీనతతో బాధపడేవారికి ఈ పండు దివ్య ఔషధం. కీళ్ల నొప్పుల నివారణకు దోహద పడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. గుండె సమస్యల నుంచి కాపాడేందుకు ఉపయోగపడుతుంది.

**- ఓంకార్‌నాథ్, ప్రభుత్వ వైద్యాధికారి**



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

## చేనేతను ఆదరించాలి : జేసీ రాహుల్

భీమవరం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించి, చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను పరిశీలించారు. స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల చేనేత వస్త్రాల నాణ్యత, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలలో చేనేత వస్త్రాలు ధరిం చడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జాతీయ చేనేత దినోత్సవం జరుపుతామన్నారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు భీమవరం పట్టణంలోని ప్రకాశం చౌక్ నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు చేనేత ర్యాలీ నిర్వహిస్తామ న్నారు. చేనేత జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, స్టాల్ మేనేజర్ పి.అనిల్‌కుమార్, ఆప్కో సిబ్బంది ఉన్నారు.



అనాథ బాలలకు ఆధార్ నమోదు చేయిస్తున్న అధికారులు

## అనాథ బాలలకు ఆధార్ నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆధార్‌లేని అనాథ బాలలను 27 మందిని గుర్తించి, వారికి ఆధార్ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సాతి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. 27 మంది బాలలలో 16 మంది బాలలకు ఇంతకుముందు ఆధార్ నమోదు పూర్తయిం దన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని ఆశాజ్యోతి ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న 11 మంది విభిన్న ప్రతిభావంతులకు సోమవారం సత్రం పాడులోని ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆధార్ నమోదు చేశామన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం దేశంలో ప్రతి పౌరుడు గుర్తింపు కార్డు కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గుర్తింపు కార్డులేని అనాథ బాలలు ఎవరైనా ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించి గుర్తింపు కార్డుల జారీకి కృషి జరుగుతుందని తెలిపారు. గుర్తింపు కార్డులేని అనాథ బాలల సమాచారం ఉన్న ప్రజలు దగ్గరలోని న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చని తెలిపారు. డీసీపీవో సూర్యచక్ర వేణి, ఆశాజ్యోతి విభిన్న ప్రతిభావంతులు ఆశ్రమం మేనేజర్ మాధవీలత, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి ఛైర్మన్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# ఉల్లి జోరు

**సిద్ధంగా ఉన్న కర్నూలు ఉల్లి**

**సాగు విస్తీర్ణం పెంచిన రైతులు**

**మరో పది రోజుల్లో మార్కెట్‌కు..**



కళ్లాల్లో ఆరబెట్టిన ఉల్లిపాయలు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో ఉల్లిధర పడనుంది. ఇప్పటికే మహారాష్ట్ర నుంచి వస్తున్న ధర తగ్గింది. ఇక మరో 10 రోజుల్లో కర్నూలు నుంచి ఉల్లి రానుంది. ఇప్పటికే అక్కడి రైతులు ఉల్లి తీసి కళ్లాల్లో ఆరబెట్టారు. అక్కడ ఎన్నడూ లేనంతగా రైతులు సాగు విస్తీర్ణాన్ని పెంచారు. గతం సంవత్సరం కర్నూలు ఉల్లికి విపరీతమైన డిమాండ్ వచ్చింది. దీనికి కారణం మహా రాష్ట్రలో వర్షాల వల్ల అక్కడ పంట దెబ్బతింది. దీంతో కర్నూలు ఉల్లి క్వింటా రూ.4500 నుంచి 6000కు విక్రయాలు జరిగాయి. కర్నూల్లో ఉల్లి సాగు చేసిన రైతుకు కాసుల వర్షం కురిసింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు ఈసారి సాగువిస్తీర్ణం పెంచారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో దిగుబడులు గణనీ యంగా ఉన్నాయి. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి మాత్రం మార్కెట్లో ఉల్లి దిగుమతి అవుతోంది. రోజుకు 10 నుంచి 15 లారీల ఉల్లి వస్తుంది. ఒక్కో లారీకి రూ.25 టన్నుల నుంచి 35 టన్నుల లోడుతో ఇక్కడికి వస్తున్నాయి. అక్కడ ఉల్లి హోల్ సేల్‌గా క్వింటా రూ.1300 నుంచి రూ.1700 విక్రయిస్తున్నారు. కిరాయిలు కలుపు కుంటే అత్యంత నాణ్యమైన ఉల్లి ఇక్కడకు చేరేసరికి రూ.క్వింటా రూ.1900కి వస్తుంది. గతవారంతో పోలిస్తే మహారాష్ట్ర ఉల్లి కూడా క్వింటా నాణ్యమైంది రూ.200 తగ్గింది.

### పది రోజుల్లో మార్కెట్లోకి కర్నూలు ఉల్లి

కర్నూల్లో ఉల్లి పంట చేతికొచ్చేసింది. ఉల్లిని రైతులు తీసి కళ్లాల్లో ఆరబెట్టారు. నాలుగు రోజుల్లో వీటిని బస్తాలో నింపుతారు. అక్కడ నుంచి మార్కెట్‌కు వస్తుంది. ఈ సంవత్సరం కర్నూలు ఉల్లి మంచి నాణ్యతా ప్రమాణాలతో పెద్ద సైజుల్లో ఉందని వ్యాపారులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఉల్లి రైతులకు అను కూలంగా ఉంటుందని చెబుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా, అధిక వర్షాలతో తడిసిన ఈ ఉల్లి నిలవకు ఆగదని చెబుతు న్నారు. కర్నూలు ఉల్లి వస్తే మార్కెట్లోకి మహారాష్ట్ర ఉల్లి దిగు మతులు తగ్గుతాయని చెబుతున్నారు. కర్నూలు ఉల్లి వస్తే మార్కెట్ మరింత పతనమైయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నా యని వ్యాపారులు పేర్కొంటున్నారు.

### ఆటోలపై జోరుగా వ్యాపారం

ఉల్లి వ్యాపారం ఇప్పుడు ఆటోలతో ఎక్కువగా జరుగుతుంది. ఆటోలను ఉపాధిగా ఎంచుకున్న యువత ఇప్పుడు ఆట్లో ఉల్లిని తీసుకెళ్లి ఇంటివద్దకే ఉల్లి విక్రయాలు చేస్తున్నారు. ఇలా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సుమారు 300కు పైగా ఆటోల్లో విక్రయించేవారు ఉన్నారంటే వ్యాపార తీవ్రత అర్ధం చేసుకోవచ్చు. వీరంతా తాడేపల్లిగూడెం హోల్‌సేల్ వ్యాపారుల వద్దకు వచ్చి నాసి రకం, మేలు రకం కొనుగోలు చేసి వాటిని కలిపేసి 5 కేజీలు రూ.100, చిన్నపాయి ఉంటే 6 కిలోల వంతున విక్రయిస్తున్నారు.

### కర్నూలు టూ బంగ్లాదేశ్

ఘాటుగా ఉండటంతో కర్నూలు ఉల్లిని బంగ్లాదేశ్, బెంగాల్, ఒడిశా ప్రాంత వాసులు ఎక్కువగా ఇష్టపడతారు. గతంలో తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌కు మంచి డిమాండ్ ఉండేది. ఇప్పుడు వ్యాపారులు పెరిగారు. కర్నూలు నుంచి తాడేపల్లిగూడెం వచ్చిన తరువాతే ఇతర ప్రాంతాలకు వెళ్లేది. ఇలా రోజుకు 100 నుంచి 150 లారీలు వచ్చేవి. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. వ్యాపారులు ఇప్పుడు నేరుగా కర్నూలు వెళ్లి కొనుగోలు చేసుకుని పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాలకు తీసుకుపోతున్నారు. దీంతో తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వచ్చే లారీల సంఖ్యం గత రెండు సంవత్సరాలుగా తగ్గింది.

### నిలకడగా కూరగాయల ధరలు

మార్కెట్లో కూరగాయల ధరలు నిలకడగానే ఉన్నాయి. దాదాపు 80 శాతం కూరగాయలు కిలో రూ.50కు దిగువనే ఉన్నాయి. పచ్చిమిర్చి కిలో రూ.80 నుంచి 100 మధ్య విక్రయించారు. ఆగాకర రూ.200, నాటు చిక్కుళ్లు 120 విక్రయిస్తున్నారు.



# పొగపెడితే పోతాయా ?

**దోమల నుంచి రక్షణకు మస్కిటో క్వాయల్స్, అగర్‌బత్తీల వినియోగం**

**కొనితెచ్చుకుంటున్న అనారోగ్య సమస్యలు**



పాలకొల్లు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దోమలకు ఇప్పుడు ఈ కాలం ఆ కాలం..అని ఏమీ లేదు.. ఏ కాలంలో అయినా పీక్కు తింటున్నాయి... దోమల దాడితో జనం బెంబేలెత్తుతున్నారు. వాటి నుంచి రక్షించుకు నేందుకు రకరకాల మార్గాలు వెతుకుతు న్నారు. దోమల కాటు వల్ల వచ్చే అనారోగ్య సమస్యల నుంచి బైటపడటానికి మార్కెట్‌లో దొరుకుతున్న మస్కిటో క్వాయల్స్, అగర వత్తులు వంటివి వాడుతున్నారు. ఈ పొగ పెట్టుకుని తలుపులు పూర్తిగా మూసి వేయడం వల్ల పొగ గదిలోనే ఉండిపోవడంతో ఆస్తమా వంటి వ్యాధులు ఉన్నవారు, చిన్నపిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరి స్తున్నారు. క్వాయల్స్, అగర వత్తుల పొగ వల్ల దోమలు చనిపోవడం.. బయటకు పారిపో వడం వంటివి జరగదు. పొగ ఉన్నంతసేపు నిద్రావస్థలో ఉంటాయి. పొగవాసన తగ్గిన వెంటనే దోమలు విజృంభి స్తుంటాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఊపిరి తిత్తులపై ప్రభావం

దోమల నివారణకు వినియోగించే మస్కిటో క్వాయల్స్ (చక్రాలు), అగర వత్తుల పొగ పీల్చడం వల్ల ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. తలుపులు మూసి వేసి పొగ బయటకు వెళ్లే మార్గం లేక పోవడంతో ఆ పొగ పీల్చడంతో ఆయాసం, దగ్గు వస్తుంటాయి. ప్రమాదకరమైన ఉత్ప త్తులు వాడటం కన్నా దోమ తెరలు ఏర్పాటు చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### ఫలితం ఇవ్వని నివారణ చర్యలు

దోమల నివారణకు మున్సిపల్ అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ సరైన ఫలితం రావడం లేదు. మలాథియాన్ మందును 10 ఎంఎల్ ద్రావణంలో 10 లీటర్ల నీరును కలిపి మురుగు డ్రైయినేజీల్లో పిచికారీ చేస్తుంటారు. సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేస్తుంటారు. ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉన్నప్పుడు వాటిల్లో మందు కలిపిన బాల్స్‌ను వేస్తున్నారు. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా దోమల నివారణ మాత్రం జరగడం లేదు. దీంతో ప్రజలు మస్కిటో క్వాయల్స్ అగర బత్తీలను వాడి ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు.



తాడేపల్లిగూడెం మార్కెట్‌లో పూల విక్రయాలు

# మార్కెట్‌లో శ్రావణ సందడి

**ఈ వారంలో వరలక్ష్మి వ్రతం, వచ్చేవారం వినాయక చవితి పండుగలు**

**అప్పుడే చుక్కలు తాకుతున్న పండ్లు, పూల ధరలు**



పెంటపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం సందడి వచ్చేసింది. తాడేపల్లి గూడెం మార్కెట్‌లో శ్రావణ సందడి మొద లైంది. ఈ నెల 8వ తేదీ వరలక్ష్మి వ్రతం... ఇదే నెల 27వ తేదీ వినాయకచవితి ఉండటంతో మార్కెట్ కళకళలాడుతోంది. సాధారణంగా వరలక్ష్మి వ్రతం ఆగస్టు నెలలో వస్తే వినాయ కచవితి సెప్టెంబరు మాసంలో వస్తుంది. ఇలా రెండు పండుగలు ఒకే నెలలో రావడం, శ్రావణ మాసం పేరు చెప్పి ఇప్పటి నుంచే పూలు, పండ్ల ధరలకు రెక్కలు వచ్చేశాయి. కొన్ని రోజుల క్రితం వరుకూ కేజీ రూ.250 నుంచి రూ.300 ఉంటే చామంతి పూల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ చామంతి ధరలు రూ.450 నుంచి రూ.500 వరుకూ విక్రయాలు జరుపు తున్నారు. దీంతో రిటైల్ ధరలు చుక్కలను తాకేలా పెరిగిపోయాయి. గతంలో రూ. 20 లకు చామంతి పూలు ఇవ్వమంటే కనీసం 15 నుంచి 20 పూల వరుకూ వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రూ.20లకు చామంతి పూలు కావాలంటే కనీసం 10 పూలు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇక మల్లెపూలు, కనకాంబ రాలు ధరలు కూడా ఇలానే ఉన్నాయి. మొన్నటి వరుకూ మూర రూ.40 అమ్మే మల్లెపూలు ప్రస్తుతం రిటైల్‌లో రూ.80 వరుకూ విక్రయాలు సాగిస్తున్నారు. కనకాంబ రాలు పరిస్థితి ఇలాగే ఉంది. మూర రూ.30 అదనంగా వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక పండ్ల ధరలు కూడా ఆకాశాన్ని తాకు తున్నాయి. గతంలో రూ.100 ఐదు దానిమ్మ కాయలు ఇచ్చేవారు. ఇప్పుడు 3 కూడా రావడం లేదు. యాపిల్‌కూడా సైజ్‌ను బట్టి భారీస్థాయిలో అమ్మకాలు జరుపుతున్నారు. రూ.500 పట్టికెళ్తే కనీసం అవసరం అయిన పండ్లు వచ్చే పరిస్థితి లేదు. ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో వినియోగ దారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పండుగ దగ్గరలో పూలు, పండ్లు కొనే పరిస్థితి ఉంటుందా అంటూ పెదవి విరుస్తున్నారు.

# చిక్కని చేప



**వేటకు ఎండ దెబ్బ**

**వరదొచ్చినా వర్షాలు లేవు**

**వేసవిని తలపిస్తున్న ఎండలు**

**ప్రతికూల వాతావరణంతో దొరకని మత్స్య సంపద**



నరసాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేటకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. వేట ప్రారంభమై 50 రోజులు గడిచినా నేటికి సరిగ్గా వేట సాగలేదు. ఇందుకు వాతావరణంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులే కారణమని మత్స్యకారులు వాపోతున్నారు. ప్రస్తుతం గోదావరికి వరదొచ్చినా వర్షాలు లేకపోవడం, వేసవిని మైమరిపిస్తూ ఎండలు కాస్తుండటంతో వల వేసినా చేప చిక్కని పరిస్థితి నెలకొంది. దీంతో చాలామంది మత్స్యకారులు బోట్లను కట్టేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని వాపోతున్నారు. సాధారణంగా గోదావరికి వరదొస్తే వర్షాలు కురిసినట్లే.. వాతావరణం కూడా చల్లబడుతుంది. ఇలాంటి పరిస్థితులు వేటకు అనుకూలంగా ఉంటాయి. మత్స్యకారులు కూడా ఉత్సాహంగా వేట సాగిస్తుంటారు. అయితే ఈసారి ఆగస్టు వచ్చినా దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెలను తలపించే విధంగా భానుడు భగభగలాడుతున్నాడు. ఉష్ణోగ్రతలు కూడా 37 డిగ్రీలు దాటుతున్నాయి. ఈ కారణంగా సముద్ర నీరు వేడెక్కుతుంది. దీంతో మత్స్య సంపద అంతా సముద్రగర్భంలో చేరిపోతున్నాయి. గాలలు కూడా వీయడం లేదు. దీంతో రాత్రయినా కడలి చల్లబడటం లేదు. ఈ కారణంగా వల వేసినా మత్స్య సంపద చిక్కని పరిస్థితి నెలకొంది. సాధారణంగా వరద సమయంలో అపార మత్స్య సంపద గర్భం నుంచి చప్పనీటి కోసం ఎదురొస్తుంది. అయితే ఎండ వేడిమికి ఈ పరిస్థితి కనిపించడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. ఈ కారణంగా వేటకు వెళ్లి రెండు మూడు రోజులు సముద్రంలో వేట సాగించినా కనీసం ఖర్చులు కూడా రావడం లేదంటున్నారు.

### రోజుకు రూ.3 నుంచి 4 కోట్లు ఎగుమతులు

సాధారణంగా ఈ సీజన్‌లో మత్స్య సంపద ఎగుమతులు పుష్కలంగా ఉంటాయి. ఆగస్టు నెల వచ్చిందంటే వరదతో పాటు వర్షాలు కూడా పడుతుంటాయి. అయితే ఈసారి దీనికి భిన్నమైన పరిస్థితి ఉండటంతో కనీసం రోజుకు రూ.10 లక్షలు కూడా మత్స్య సంపద ఎగుమతికి నోచుకోవడం లేదు. దీంతో మత్స్యకారులతో పాటు దీనిపై ఆధారపడ్డ అనేక మంది కార్మికులు ఉపాధికి దూరమవుతున్నారు. సాధారణంగా నరసాపురం తీరంలో వేట సాగించేందుకు ఈ సీజన్‌లో 300 నుంచి 500 బోట్లు వరకు వస్తుంటాయి. వీటితో పాటు ఫైబర్ బోట్లు ఎక్కువే. ఈసారి మత్స్య సంపద చిక్కకపోవడంతో మత్స్యకారుల్లో నిరుత్సాహం నెలకొంది.

### వాతావరణ ప్రభావమే..

సాధారణంగా ఈ సీజన్‌లో పుష్కలంగా మత్స్య సంపద దొరుకుతుంది. అయితే ఈ ఏడాది దీనికి భిన్నమైన పరిస్థితులు కనిపి స్తున్నాయి. ఆగస్టు వచ్చినా వర్షాలు లేవు. వీటికి తోడు వేసవిని తలపిస్తూ ఎండలు కాస్తున్నాయి. ఎండ వేడిమికి సముద్రంలోని మత్స్య సంపద కిందకు వెళ్లిపోతుంది. ఎన్ని రోజులు ఉండి వేట సాగించినా ఇదే పరిస్థితి. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు. వర్షాలు వస్తేగాని వేటకు అనుకూల పరిస్థితులు కనిపించడం లేదు.

**- పీతల ప్రసాద్, ఎగుమతిదారుడు**

## ఇవేం ఎండలు బాబోయ్ !



ఎండకు నిర్మానుష్యంగా మారిన అలంపురం జంక్షన్

పెంటపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలోనూ సూరీడు మండిపోతున్నాడు. భగభగలాడుతూ విరుచుకు పడుతున్నాడు. ఇవేం ఎండలంటూ ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ దంచేస్తోంది. బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు.. రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. చాలామంది ఎండకు భయపడి పనులకు కూడా వెళ్లని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మరోపక్క రైతులు కూడా పెరుగుతున్న ఎండలకు భయపడిపోతున్నారు. ప్రస్తుతం వరిచేలు నాట్లు వేసే దశలో ఉన్నందున వర్షాలు పడాలి.. శ్రావణమాసం వచ్చి వారం రోజులు గడుస్తున్నా సరిగా వర్షాలు పడటం లేదని వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు కాస్తున్నాయని ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని రైతులు చెబుతున్నారు.



తణుకు రోటరీక్లబ్‌లో జరిగిన 'సాంస్కృతిక వాదం రాజ్యాంగ విలువలు' అనే అంశంపై మాట్లాడుతున్న కొప్పర్తి వెంకటరమణమూర్తి

## మత జాతీయ వాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధం

తణుకు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):మెజారిటీ మత జాతీయవాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధమైనదని ప్రముఖ చరిత్రకారుడు కొప్పర్తి వెంకట రమణమూర్తి చెప్పారు. తణుకు రోటరీ ఆడిటోరియంలో రాజ్యాగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో జరిగిన 'సాంస్కృతిక వాదం- రాజ్యాంగ విలువలు' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో కొప్పర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ డీవీవీఎస్ వర్మ అధ్యక్షత వహించారు. కొప్పర్తి మాట్లాడుతూ దేశంలో నివశించే ప్రజలందరికీ చెందిన భారత ప్రాదేశిక జాతీయవాదానికి మెజారిటీ మతానికి మాత్రమే పరిమిత మైన జాతీయవాదానికి మధ్య సంఘర్షణ జరుగుతుందన్నారు. ఈ జాతీయ వాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని చెప్పారు. భారత రాజ్యాంగం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన ప్రజాస్వామ్య హక్కులను కల్పించిందన్నారు. దేశ ప్రజలందరూ ఒక జాతిగా రూపొంద డానికి రాజ్యాంగం ప్రాతిపదికను ఇచ్చిందన్నారు. మెజారిటీ మత జాతీయ వాదం కేవలం అధికారం కోసం ప్రజలను విభజించి చేసే విధ్వంస రాజ కీయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదన్నారు. మత పరమైన విభజన కోసం జరుగుతున్న చరిత్ర వక్రీకరణను ప్రతీఒక్కరూ తిప్పి కొట్టాలని చెప్పారు. కొప్పర్తి రాసిన 'చరిత్ర- జాతీయత సాంస్కృతిక ఆధిక్యం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ బీ.రమేష్ చంద్రబాబు, పేరూరి మురళీకుమార్, అహ్మద్ రెహ్మాన్, ఆకుల వెంకటేశ్వరరావు, హుస్సేన్ అహ్మద్, మనోరమ పాల్గొన్నారు.



కోపల్లెలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

## కోపల్లెలో కేవీకే శాస్త్రవేత్తల పర్యటన

కాళ్ళ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):కాళ్ళ మండలంలోని కోపల్లె గ్రామంలో ఉండి కేవీకే శాస్త్రవేత్తల బృందం సోమవారం పర్యటించింది. కేవీకే శాస్త్రవేత్తలు అందించిన నూతన వరి రకం ఎంటీయూ 1212 క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో నూతన వరి వంగడం రకం కాలపరిమితి 140 రోజులని, సీజనల్‌గా వచ్చే తెగుళ్ళను తట్టుకుని అధిక దిగుబడి వస్తుందని వివరించారు. కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదని, వాటి వల్ల జింకు, ఐరన్ లోపాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నత్రజని, పొటాష్‌లను మాత్రమే వాడాలని సూచించారు. శాస్త్రవేత్తలు ఎస్.మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, ప్రవీణ, రమేష్ నాయుడు, వీఏఏ మౌనిక పాల్గొన్నారు.

## రేపటి నుంచి క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవంపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లా, జోనల్ రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నన్నాయి. ఏలూరు జిల్లాలో 10 క్రీడా అంశాల్లో అండర్-22 పురుషులు, మహిళల జట్లకు ఈనెల 6 నుంచి పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీల్లో గెలుపొందిన జట్లను జోనల్ పోటీలకు ఎంపిక చేస్తారు. ఇక్కడ రాణించే క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో పోటీల్లో ఆడేందుకు అవకాశం కల్పించారు. ఈనెల 6న జంగారెడ్డిగూడెంలో ఆర్చరీ, ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్స్, ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బ్యాడ్మింటన్, ఏలూరు కండ్రికగూడెం బాక్సింగ్ అకాడమీలో బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. 7వ తేదీన అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, కోకో, వాలీబాల్, ఏలూరు ఇండోర్ సీతారామరాజు స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. ఈనెల 6, 7 తేదీల్లో జిల్లాస్థాయి పోటీలు, ఆగస్టు 11 నుంచి 14వ తేదీ వరకు జోనల్‌స్థాయి, 16 నుంచి 20 తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగునున్నాయి. వివరాలకు 98663 17326 నంబర్‌లో సంప్రదించవలసిందిగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు మండపాక విద్యార్థినులు



తణుకు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):చీరాలలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తణుకు రూరల్ మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఫణిశ్రీ తెలిపారు. ఆదివారం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన జిల్లా అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన ఎం.నాగలక్ష్మీ లాంగ్ జంప్‌లో ప్రథమస్థానం, 600 మీటర్ల రన్నింగ్‌లో తేజారత్నం ప్రథమస్థానం, హైజంప్‌లో దివ్య శ్రీలక్ష్మీ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణలను సర్పంచ్ జానా వెంకటలక్ష్మీ, మండల టీడీపీ అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, ఉప సర్పంచ్ నగేష్, జనసేన నాయకులు శ్రీనివాసు, స్కూల్ ఛైర్మన్ గూడూరి మహాలక్ష్మీ తదితరులు అభినందించారు.

### పెనుగొండ భాష్యం విద్యార్థులు ..



పెనుగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెనుగొండ భాష్యం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ వెంకట అప్పారావు తెలిపారు. విద్యార్థులు చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

### పోస్టు బేసిక్ స్కూల్ విద్యార్థిని ఎంపిక



పెంటపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు పెంటపాడు పోస్టు బేసిక్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన జి.చాందిని ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నారిపాటి రాజేష్ తెలిపారు. రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ లో పోటీలలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కళింగ లక్ష్మణరావు, పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థినిని అభినందించారు.

## గల్ఫ్ నుంచి ఇండియాకు క్షేమంగా చేరిన మహిళ

కొయ్యలగూడెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇండియాకు రాలేక గల్ఫ్‌దేశమైన కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మర్రిపూడి సుమ అనే మహిళ సోమవారం స్వగ్రామం చేరింది. గత నెల 27వ తేదీన 'మా అమ్మను భారత్‌కు రప్పించండనే' వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి ఆ మహిళను సోమవారం స్వగ్రామం బయ్యన్నగూడెం చేర్చారు. దీంతో ఆ మహిళ ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపింది. దీనిపై టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని మంత్రి నారా లోకేశ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా నాయకులు స్పందించి ఈ మహిళను క్షేమంగా ఇండియాకు తీసుకొచ్చినట్టు తెలిపారు.

# నిరసనల హోరు

» ధర్నాలతో దద్దరిల్లిన ఏలూరు, భీమవరం కలెక్టరేట్లు » సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సోమవారం వేర్వేరు సమస్యలపై పలువురు నిరసనలు చేపట్టారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములిచ్చిన తమకు పరిహారం చెల్లించాలని ఏలూరు కలెక్టరేట్ వద్ద రైతులు ఆందోళన చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించిన గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలంటూ విద్యార్థి సంఘాలు, నరసాపురంలో ప్రిన్సిపాల్ తీరుకు నిరసనగా విద్యార్థులు పాఠశాల గేటుకు తాళం వేసి ధర్నా చేశారు. మంచినీటి కోసం ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు.. భర్త నుంచి భార్యకు రక్షణ కల్పించాలని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పనిచేయని ఫోన్లు వద్దంటూ అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు.



మొగల్తూరు అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన

## అంగన్వాడీల ఆందోళన



ఏలూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద..

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద పనిచేయని ఫోన్లు వద్దని కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఏలూరు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఏలూరు జిల్లాలోని పెదపాడు, బుట్టాయగూడెం, చింతలపూడి, ముదినేపల్లి, కైకలూరు, పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు.



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన దళిత ఐక్యవేదిక

## భర్త నుంచి భార్యకు రక్షణ కల్పించాలి

భీమవరం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పెనుగొండకు చెందిన పడాల మీనాక్షి అనే గృహిణికి భర్త మునలయ్య నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయా లని దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ మునలయ్య, మీనాక్షిల వివాహమై 23 ఏళ్ల అయిందని, తొమ్మిదేళ్లుగా మీనాక్షిని వదిలేసి మానసికంగా వేధిస్తున్నారని, దీనిపై పెనుగొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందించ లేదని, దీనిపై ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి వినతి పత్రాన్ని అందించామని, మునలయ్య నుంచి గృహిణికి రక్షణ కల్పించాలని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలీమా, జిల్లా ప్రెసిడెంట్ యల్లబిల్లి ఝాన్సీ కొండేటి లాజర్, మాల మహానాడు జాతీయ కన్వీనర్ చీకటిపల్లి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కరించాలి

ఆకివీడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):మంచినీరు అందించాలని ఆకివీడు నగర పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో 14వ వార్డు మహిళలు నిరసన తెలిపారు. వార్డులో నాలుగు నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదన్నారు. ఏఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావుకు వినతులు అందించారు.



ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయ ఏఈకి మహిళల అర్జీ




నరసాపురం పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

## స్కూల్ వద్ద విద్యార్థుల ఆందోళన

నరసాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని నారాయణ స్కూల్ వద్ద సోమవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ రాజీవ్ వైఖరి, స్కూల్‌లో మౌలిక వసతులు లేకపోవడం, టీచర్ల కొరతను నిరసిస్తూ విద్యార్థులు గేట్‌కు తాళం వేసి ధర్నా చేశారు. వీరి ఆందోళనకు సీపీఎం సంఘీభావం తెలిపింది. రెండు గంటలపాటు విద్యార్థులు ఆందోళన చేశారు. పోలీసులు స్కూల్ వద్దకు చేరుకున్నారు. ప్రిన్సిపాల్‌తో చర్చించారు. సమస్యల్ని పరిష్కారిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీపీఎం నాయకుడు త్రిమూర్తులు పాల్గొన్నారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద గిరిజన కానిస్టేబుల్ అభ్యర్థుల నినాదాలు

## కానిస్టేబుల్ నియామకాల్లో న్యాయం చేయాలి

ఏలూరు రూరల్/బుట్టాయగూడెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ నియామకాల్లో తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన యువతీ యువకులు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కానిస్టేబుల్ ఎంపికలో అన్ని విభాగాల్లో తాము అర్హత సాధించినా ఉద్యోగం రాలేద ని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో 70 మార్కులు సాధిస్తే ఉద్యోగం ఇచ్చారని ఏలూరులో జిల్లాలో 80, 90, 100 మార్కులు వచ్చి నా ఉద్యోగం రాలేదని పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు అధికారు లు ముందు గోడు వెళ్లబోసుకున్నారు. నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా ఏజెన్సీకి పోస్టులు కేటాయించాలని, ఓపెన్ కేటగిరిలో రాకపోయినా ఎస్టీ రిజర్వేషన్‌లో తమకు అవకాశాలు తప్పకుండా రావాల్సి ఉండగా ఏజెన్సీ ప్రాంతంలో ఒక్క పోస్టును భర్తీ చేయలేదన్నారు. గిరిజన యువతతో పాటు ఏజెన్సీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు అధికారులను కలిసి న్యాయం చేయాలని కోరారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

## గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతుల ధర్నా

ఏలూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మాణం జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు కల్పించాలని, అండర్‌పాస్ బ్రిడ్జిలు, భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలుచేసి భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత పోరాట కమిటీ, ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ధర్నా నిర్వహించారు. రైతులు కలెక్టరేట్ లోపలికి వెళ్ళేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ధర్నానుద్దేశించి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేలో రైతులు పచ్చటి సారవంతమైన భూములను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ, వామిశెట్టి హరిబాబు, కె నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు గోలి సత్తిరెడ్డి, మండలపు నాగలింగం, కేవీవీ సత్యనారాయణ, ఐ.ప్రదీప్‌రాజు, అందుగుల మోహనరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి కోన శ్రీనివాసరావు, బొడ్డు రాంబాబు, లావేటి సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరులో వైద్యుల నిర్లక్ష్యం

» వ్యక్తి మరణించిన ఎనిమిది గంటల తరువాత ఎమ్మెల్సీ ఇంటిమేషన్
» ఆస్పత్రి ముందు బంధువుల పడిగాపులు

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి తన జీవితాన్ని ముగించుకున్నాడు.మరణించిన వ్యక్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతను మరణించిన ఎనిమిది గంటల తరువాత పోలీసులకు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమాచారమిచ్చారు. ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారో ఈ ఘటనే స్పష్టమవుతోంది. భీమవరం సమీపంలోని కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన మాణెం శివ ప్రసాద్(50)కు భార్య మధురశ్రీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె డిగ్రీ చదువుతుండగా మరో కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతోంది. శివ ప్రసాద్ ఒక మిక్చర్ బండి వద్ద పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదు నెలల క్రితం సైకిల్‌పై నుంచి పడిపోవడంతో అతడికి ఆపరేషన్ కూడా నిర్వహించారు. కుటుంబాన్ని తన కష్టంతో పోషించాల్సిన వాడిని తానే ఆ కుటుంబానికి బారంగా మారానని కుమిలిపోతూ తాను ఎప్పటికి ఆరోగ్యంగా కోలుకోలేని బాధతో జీవితంపైనే విరక్తి పెంచుకున్నాడు. చివరకు సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్దే పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు అతడిని తొలుత భీమవరం ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి సోమవారం ఉదయం 11.07 నిమిషాలకు తీసుకువచ్చారు. ఆసుపత్రిలోని ఇఎండి వార్డులో చేర్పించారు. 20 నిముషాల వ్యవధిలోనే అతను మృతి చెందాడు. సాధారణంగా ఎమ్మెల్సీ కేసుల్లో మరణించిన వెంటనే ఎమ్మెల్సీ ఇంటిమేషన్‌ను ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు అందిస్తారు. అక్కడ పోలీసులు సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తారు. వారు వెంటనే ఆసుపత్రికి వచ్చి పంచనామా నిర్వహించి వైద్యులు చేత పోస్టుమార్టం జరిపించి మృత దేహాన్ని అప్పగిస్తారు. కానీ ప్రసాద్ 11.27 నిముషాలకు మరణిస్తే సోమవారం రాత్రి 7.20 నిమిషాలకు డెత్ ఇంటిమేషన్‌ను ఆసుపత్రి వైద్యులు, ఔట్‌పోస్టు పోలీసులకు అందించారు. ప్రసాద్ మరణించిన ఎనిమిది గంటల తరువాత ఇంటిమేషన్ అందించారు. దీంతో ఉదయం నుంచి ఆ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్దే బిక్కుబిక్కుమంటూ తమ బంధువు మృత దేహం కోసం పడిగాపులుపడుతూనే ఉన్నారు. అక్కడ సిబ్బందిని అడిగితే వారు విసుక్కున్నారని వైద్యులు ఒకరిపై ఒకరు వంతులు వేసుకుని సంతకం పెట్టలేదని చెప్తున్నారు. మొత్తం మీద సోమవారం పోస్టుమార్టం జరగాల్సిన మృత దేహం చివరకు మార్చురీలోనే ఉంది. ఆ కుటుంబ సభ్యులు అన్నపానాలు కూడా ముట్టుకోకుండా నీరసించిపోయి మృతదేహం ఎప్పుడిస్తారో అంటూ దుఃఖంతో ఆస్పత్రి వద్దే రోదిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఎన్నిసార్లు ఆసుపత్రి వైద్యులకు హెచ్చరికలు జారీ చేసినా తాము ఇంతేనంటూ విధులను నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు ఈ సంఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరిపై కేసు

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మరో యువకుడు అతి వేగంగా మోటారు సైకిల్‌పై వచ్చి తగిలాడు. దీంతో వారిమధ్య గొడవ జరిగింది. దీంతో ఇరువర్గాలు అర్ధరాత్రి దాడులకు తెగబడ్డారు. ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాలపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు చిరంజీవి బస్టాప్ ప్రాంతానికి చెందిన వల్లపు సాయికుమార్ తన స్నేహితుడితో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా పోణంగి రోడ్డు జరుగులమ్మ గుడి ప్రాంతానికి చెందిన కాటూరి లక్కీ అనే బైక్ మెకానిక్ ఈ నెల 3వ తేదీ రాత్రి మోటార్ సైకిల్‌పై వేగంగా వెళ్తూ సాయికుమార్ మోటారు సైకిల్‌కు తగిలాడు. వీరి మధ్య మాటామాటా పెరిగి రెండు వర్గాలు ఘర్షణలకు దిగారు. ఒక వర్గం ఏలూరు పాతబస్టాండ్ వద్దకు వచ్చి కొద్దిసేపు ధర్నా చేశారు. పోలీసులు వెంటనే వారిని అక్కడ నుంచి పంపించి వేసి ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


## ఆలయ హుండీలో నగదు చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఏలూరు గజ్జలవారి చెరువు సమీపంలో ఉన్న దాసాంజనేయ స్వామి గుడిలో హుండీ పగులగొట్టి సుమారు రూ.10 వేలు అపహరించుకుపోయారని ఫిర్యాదు అందడంతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గజ్జెలవారి చెరువు వద్ద ఉన్న దాసాంజనేయ స్వామి గుడిలో ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు హుండీ పగులగొట్టి సుమారు రూ.10 వేల నగదు అపహరించారంటూ ఆ గుడి కమిటీ సభ్యుడు కొల్లిపర బుద్ధ భగవాన్ కృష్ణ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఫినాయిల్ తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వృద్ధుడు జీవితంపై విరక్తి చెందిన బాత్‌రూమ్‌లోని ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు కొత్తగూడేనికి చెందిన చేపల ప్రసాద్ (78) వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం సైకిల్‌పై నుంచి పడిపోవడంతో మక్కి ఆపరేషన్ చేశారు. అయితే అతను బాత్‌రూమ్‌కు కూడా కుటుంబ సభ్యులే తీసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. ఈనెల 3వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులు బాత్‌రూమ్‌కు తీసుకెళ్లగా అక్కడ ఉన్న ఫినాయిల్ తాగి పడిపోయాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ప్రసాద్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పరుపుల తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం



ఏలూరు క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో ఉన్న పరుపుల తయారీ కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు నాలుగు లక్షల విలువైన సోఫా సెట్లు, పరుపులకు సంబంధించిన మెటీరియల్ దగ్ధమైంది. ఏలూరు చేపల తూము సెంటర్‌లో వీనల్ డిజైనింగ్ బెడ్స్ అండ్ కుషన్స్ వర్క్స్ తయారీ కేంద్రాన్ని సరికొండ వెంకట సూర్యనారాయణ రాజు నిర్వహిస్తున్నారు. యధావిధిగా ఈనెల 3న రాత్రి తాళం వేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తరువాత అకస్మాత్తుగా మంటలు రావడంతో చుట్టుపక్కల వారు మేల్కొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి వి.రామకృష్ణ వారి సిబ్బందితో ఫైర్ ఇంజన్‌తో అక్కడికి చేరుకున్నారు. టూటౌన్ సీఐ అశోక్ కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని అతి కష్టం మీద మంటలను అదుపు చేశారు. సుమారు నాలుగు లక్షల రూపాయల విలువైన మెటీరియల్ దగ్ధమైనట్టు అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు.

## కోడి వ్యర్థాల వ్యాన్ పట్టివేత.. ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి కోడి వ్యర్థాలను మినీ లారీలో పెదపాడు మండల పరిధిలో ఉన్న చేపల చెరువుల వద్దకు తీసుకెళ్తుండగా ఏలూరు త్రి టౌన్ పోలీసులు మార్గమధ్యలో అదుపులోకి తీసుకున్నారు. పెదపాడునకు చెందిన వేగిరెడ్డి రామ్మోహనరావు, ఏలూరులోని గొల్లాయిగూడేనికి చెందిన గొల్లవరపు జాన్ కలిసి హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కోడి వ్యర్థాలను మినీ లారీలో వేసుకుని సోమవారం తెల్లవారు జామున ఏలూరు రామకృష్ణాపురం బ్రిడ్జి మీదుగా వెళ్తుండగా త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాన్‌ను సీజ్ చేసి వారిద్దని అరెస్టు చేశారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఆచంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని బాలంవారిపాలేనికి చెందిన గుడాల లక్ష్మీనారాయణ ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ఎంతగా గాలించినా ఆచూకీ తెలియరాలేదు. భార్య జ్యోతి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## బీచ్‌లో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

మొగల్తూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో సెదతీరేందుకు వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థుల మిత్ర బృందంలో విషాదం నెలకొంది. భీమవరం బీవీరాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న పది మంది విద్యార్థులు సోమవారం సరదాగా పేరుపాలెం బీచ్‌కు వచ్చి సముద్ర స్నానానికి దిగారు. వీరిలో బి.తన్వీర్ అనే విద్యార్థి గల్లంతవడంతో పోలీసులు, అతని స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టారు.

## భార్యపై కత్తితో భర్త దాడి

జీలుగుమిల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పి.రాజవరంలో భార్యపై భర్త కత్తితో దాడి చేయడంతో బాధితురాలు ఆస్పత్రి పాలైంది. గ్రామానికి చెందిన తెల్లం సింగరాజు, లక్ష్మి వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. కొద్ది రోజులుగా సింగరాజు మద్యానికి బానిసయ్యి ఆస్పత్రిపాలవడంతో భార్య తెల్లం లక్ష్మి ఆస్పత్రిలో వైద్యం చేయించింది. ఆరోగ్యం కుదుటపడటంతో మళ్లీ సింగరాజు మద్యం తాగడం మొదలుపెట్టాడు. దీంతో భార్యభర్తల మధ్య సోమవారం వాగ్వాదం జరిగింది. ఆవేశంతో భార్య తలపై సింగరాజు కత్తితో నరికాడు. లక్ష్మీ తీవ్రంగా గాయపడటంతో బంధువులు జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. తలపై పది కుట్లుపడ్డాయి. ఈ విషయమై ఎస్.ఐ. విక్రాంతికుమార్‌ను వివరణ కోరగా ఇంకా సమాచారం రాలేదని, ఆస్పత్రి నుంచి ఎమ్మెల్సీ రిపోర్టు రావాల్సి ఉందన్నారు.

## కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు

భీమవరం క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):తనను ముగ్గురు అధికారులు కులం పేరుతో దూషించారంటూ పట్టణానికి చెందిన కలిగితి మధు టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి టూటౌన్ ఎస్ఐ కె.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కలిగితి మధు 2008లో ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిలో చేరాడు. ఆ తర్వాత అటెండర్‌గా విధులు నిర్వహించాడు. తర్వాత మధును డ్రైవర్‌గా కొనసాగించారు. ఇదిలా ఉండగా 2021లో వి.సందీప్ ఐటీవోగా, ఎస్‌కె ఖాదర్ ఓఎస్‌గా, బి.మనోజ్‌కుమార్ ఎంటిఎస్‌గా విధుల్లో చేరారు. కొంత కాలం తర్వాత తాను డ్రైవింగ్ చేయలేనని అధికారులకు చెప్పడంతో వారు మధుపై కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో కులం పేరుతో దూషించి 2022లో విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

## రైలు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):రైలు పట్టాలు దాటుతున్న ఒక యువకుడిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన పొలగాని కృష్ణారావు(23) సోమవారం ఉదయం ఆ గ్రామ సమీపంలోని రైలు పట్టాల వద్ద బహిర్భూమికి వెళ్లాడు. విజయవాడ నుంచి విశాఖ వెళ్లే రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణారావు కొంత కాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎంఎస్ఎన్ ప్రసాద్, తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## డ్రోన్ కెమేరాతో పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఆధునిక సాంకేతికతను ఉపయోగించి డ్రోన్ కెమేరా ద్వారా జంగారెడ్డిగూడెం పోలీసులు పేకాట స్థావరాన్ని గుర్తించారు. మార్కెట్ యార్డు సమీపంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ డ్రోన్ కెమేరా ద్వారా పేకాట స్థావరాన్ని గుర్తించారు. పేకాడుతున్న వ్యక్తులు డ్రోన్ గుర్తించి పారిపోయే యత్నం చేశారు. దీంతో వెంటనే పోలీసులు పేకాట శిబిరం వద్దకు వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4100 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా పెట్టినట్టు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెనుగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెనుగొండ గురుకుల పాఠశాలలో 10వ తరగతిలో ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. సుభాషిణి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పెనుగొండలో సీట్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఓసీ 1, ఎస్టీ2, బీసీ 1, బీసీబీ 4, ఎస్సీ 3 ఉన్నట్లు తెలిపారు. పదవ తరగతి సీటు కావాల్సిన వారు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 94906 13353, 85558 43214 కు సంప్రదించాలని కోరారు

## పూర్వ విద్యార్థుల వితరణ

పాలకోడేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు 1986-91 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు రూ.10 వేల విలువ చేసే స్పోర్ట్స్ డ్రెస్‌లు, వాలీబాల్స్‌ను అందించారు. కార్యక్రమంలో పీడీ శంకర్, పూర్వ విద్యార్థులు ఎం.విజయప్రసాద్, పెరుమాళ్ళ శ్రీనివాస్, ఇసుకపల్లి కృష్ణంరాజు, రేవులగడ్డ సుబ్బారావు, టేకు శ్రీను, కొల్లి పద్మావతి, శ్యామసుందరి, కాంతరత్నం, దావీదు, సంపత్‌రావు, కొల్లి సత్యనారాయణ, పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అంతరిక్ష పరిశోధనలపై అవగాహన ఉండాలి



శిక్షణ శిబిరంలో ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు రూరల్, అగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం తణుకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతరిక్ష నైపుణ్య శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. అంతరిక్ష విద్య, సోలార్ విధానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. అభ్యాసన ఆధారిత శిక్షణ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండానే స్థానికంగానే నిపుణులను తీసుకువచ్చి వారితో శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వారు ఇస్రో, నాసాలలో జరుగుతున్న ప్రయోగాలకు సంబంధించిన అంశాలను ఇక్కడ విద్యార్థులకు వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ సిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ముస్కాన్ డైరెక్టర్ ప్రవీణ్, గోపాల్, విఠల్, డీఈవో నారాయణ పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి సొసైటీలు కృషి చేయాలి

ఇరగవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమంతోపాటు వారి అభివృద్ధికి వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. కొత్తపాడు సొసైటీ త్రి సభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. వైసీపీ హయాంలో సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసి అనేక సొసైటీల్లో అవకతవకలు చేసి భ్రష్టు పట్టించారని ఆరోపించారు. లాభాల్లో ఉన్న సొసైటీలను సైతం నష్టాల్లోకి నెట్టివేసి సొసైటీల్లోని నిధులను ఇతర మార్గాల ద్వారా మళ్లించి ఆర్థికంగా బలహీనం చేశారన్నారు. కొత్తపాడు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులుగా పని చేసిన సుబ్బరాజు సొసైటీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ సొసైటీ ఛైర్మన్ కారెం బాబూరావుతో పాటు డైరెక్టర్లను అభినందించారు.

## ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



వాటర్ ప్లాంట్ శంకుస్థాపన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ముదునూరు అరుంధతి పేటలో వాటర్‌ప్లాంట్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ పీహెచ్‌సీలో నూతనంగా నిర్మాణం చేసిన షెడ్డు, రైతు సేవా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సొసైటీ మాజీ ఛైర్మన్ బోరాడ శ్రీనివాసరావు గజమాలతో ఎమ్మెల్యే బొలిశెట్టిని సత్కరించి రైతు సేవా కేంద్రం అభివృద్ధి కోసం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచ్ బావన ధాన్యలక్ష్మి, పుల్లాబాబి, కిలపర్తి వెంకట్రావు, దత్తు ప్రసాద్, బుద్దన నారాయణ, గొర్రెపాటి సింహాచలం పాల్గొన్నారు.

## 53 వినతులు అందజేత

నరసాపురం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి 53 వినతులు స్వీకరించారు. సరిహద్దు తగదాలు, పింఛన్లు, థామస్ వంతెన వద్ద అసాంఘీక కార్యక్రమాలను నివారించాలని విన్నవించారు. వీటిని తక్షణం పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

## 12 నామినేషన్లు స్వీకరణ

నరసాపురం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలకు సోమవారం నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్ బరిలో నిలిచిన అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి గన్నాబత్తుల వల్లభరావు, బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి వైఎస్ ఫణికర్, వి.నాగేంద్రరావు, జనరల్ కార్యదర్శికి వెన్నా సూర్యప్రకాశ్‌రావు, కోశాధికారికి పూరేళ్ళ శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. ఇవి కాకుండా జాయింట్ సహాయ కార్యదర్శికి ఇద్దరు, కౌన్సిల్ సభ్యులకు నలుగురు నామినేషన్లు వేశారు.

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి



జేసీ రాహుల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న వైసీపీ నాయకులు

యలమంచిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని భీమవరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి యలమంచిలి ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి సోమవారం వినతిపత్రం అందజేశారు. యలమంచిలి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల జరిగిన వివిధ అభివృద్ధి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు తనకు, వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులకు ఏవిధమైన సమాచారం ఇవ్వకుండా అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారని ఆరోపించారు. జాయింట్ కలెక్టర్‌ను కలిసిన వారిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైసీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.

## పరిష్కార వేదికలో రెండు ఫిర్యాదులు

మొగల్తూరు, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు ఫిర్యాదులు వచ్చినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. తమ భూమికి సంబంధించిన సరిహద్దులను కొలిచి తమకు హద్దులు నిర్ణయించాలని ఇరువురు ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపిడివో నవీన్ కిరణ్, ఏఈవో శ్యామ్యూల్ జాన్ వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 100 సార్లు కాశీయాత్ర పూర్తి

గణపవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు అన్నారు. ప్రముఖ అధ్యాత్మికవేత్త కొలనువాడ సుబ్బరాజు 100సార్లు వారణాసి (కాశీయాత్ర) పూర్తి చేసుకున్న సందర్భంగా తన స్వగృహంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ చేశారు.

# త్రిసభ్య కమిటీల గడువు పెంపు

(5వ పేజీ తరువాయి)

జరుగుతోంది. పలు సహకార సంఘాలపై తర్జన భర్జనతో కూటమి నేతల మధ్య పోటీ నెలకొంది. తాడేపల్లిగూడెం నియోకవర్గంలోని కొమ్ముగూడెం సొసైటీ విషయంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు చెరో జాబితా పంపాయి. తాడేపల్లిగూడెం సహకార సంఘానికి జాబితా ఇంకా వెళ్లలేదు. భీమవరంలో త్రిసభ్య కమిటీల కూర్పుపై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి అసంతృప్తి వ్యక్తం చేశారు. నరసాపురంలో జాబితాలు పంపడంలో జాప్యం కాగా ఉండి నియోకవర్గ పరిధిలో జాబితాలు వెళ్లాయి. మూడో విడత జాబితాను విడుదల కోసం కూటమి శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. కమిటీలు ఎప్పుడు ప్రకటించినా మొత్తం 117 సంఘాలకు కాలపరిమితి జనవరి 31తో ముగుస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు కమిటీల భవితవ్యం ఆధారపడి ఉంటుంది.







భీమవరంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను అభినందిస్తున్న రాష్ట్ర మంత్రి నిమ్మల.. ఎమ్మెల్యే నాయకర్, బీజేపీ నాయకుల శుభాకాంక్షలు.. మొగల్తూరులో రోగులకు రొట్టెల పంపిణీ

# ఘనంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పుట్టిన రోజు వేడుకలు

భీమవరంటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భీమవరంలోని కేఎస్ రాజు ఫంక్షన్ హాల్‌లో జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి శ్రీని వాస వర్మకు శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. కేంద్రమంత్రి వర్మను కలిసిన వారిలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, తోట సీతారామలక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్‌గా ఎంపికైన కలిదిండి సుజాత, డీఎన్ఆర్ కళాశాల సెక్రటరీ గాదిరాజుసత్యనారాయణరాజు, కోళ్ళనాగేశ్వరరావు, ఉద్దరాజు కాశీ విశ్వనాధరాజు, ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డిఎస్పీ ఆర్.జయసూర్య, డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ తదితరులు కలిసి కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కేఎస్ రాజు ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం, ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరాలను కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించారు.

### కూటమి నాయకుల శుభాకాంక్షలు

నరసాపురం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు సోమవారం నరసాపురం కూటమి నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భీమవరం వెళ్లి ఆయనకు బొకేలు అందించారు. కార్యక్రమంలో వలవల నాని, పోలిశెట్టి నళిని, షైలా వసంతరావు, కోటిపల్లి వెంకటేశ్వరావు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు ఆధ్వర్యంలో శ్రీనివాసవర్మకు బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ జన్మదినోత్సవం తాడేపల్లిగూడెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ, పట్టణ అధ్యక్షుడు దువ్వ శ్రీను, నాయకులు ముప్పిడి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయాల్లో పూజలు నిర్వహించి, వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

**ఆచంట:** బీజేపీ నాయకులు ఆచంటలో కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు నేదునూరి శ్రీనుబాబు, ముచ్చర్ల నాగ సుబ్బారావు, కొత్త భాస్కర నాగ భూషణం, బందా సతీష్ కుమార్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కేతా మీరయ్య పాల్గొన్నారు.

**మొగల్తూరు:** మొగల్తూరులో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసరి బాబి ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేసి జన్మదినకేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పులపర్తి రమేష్, కొల్లాటి చెన్నకేశవ్, బొరుసు శివ, కొత్తపల్లి మురళీకృష్ణ పాల్గొన్నారు.

**తణుకు రూరల్:** కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మంత్రిని కలసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం భీమవరంలో జరిగిన వేడుకలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ తదితరులు పాల్గొన్నారు. జిల్లా బీజేపీ ఉపాధ్య క్షుడు సింహాద్రి లక్ష్మణ్ కుమార్ గుప్తా ఆధ్వ ర్యంలో దువ్వ గ్రామంలోని పలు దేవాల యాలలో ప్రత్యేక పూజలు చేసి పేదలకు దుస్తు లు, మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు.

## సురక్షితమైన తాగునీరు అందించేందుకు కృషి



స్విచ్ ఆన్‌చేసి ఉచిత మంచినీటి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

వీరవాసరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుర క్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. వీరవాసరంలో సోమవారం ఉచిత మంచినీటి పథకం (వాటర్ ప్లాంట్)ను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభిం చారు. వాటర్ ప్లాంట్‌ను నిర్మించిన దాతలు గంధం వెంకట స్వామి నాయుడు, లక్ష్మి, సోమ సుందరం, కుమారుడు నాగబాబులను ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్ర మంలో వీరవాసరం జడ్పీటీసీ గుండా జయ ప్రకాష్‌నాయుడు, సర్పంచ్ చికిలే మంగతాయరు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవతో రైతుల్లో ఆనందం



గునుపూడిలో ఇస్త్రీ చేస్తూ సమస్యలు తెలుసుకుంటున్న తోట సీతారామలక్ష్మి

భీమవరం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ యోజన పథకాన్ని అందుకున్న రైతన్నలు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనులు ప్రారంభించారని రాజ్యసభ మాజీ సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు మద్దుల రాము ఆధ్వర్యంలో 17వ వార్డు గునుపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రజకులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థ సారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వ రరావు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


భీమవరం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెదగరువు, రాజులగరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతోపాటు ఆక్వా, చేపల చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

## ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



వలవల బాబ్జిని సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

పెంటపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆకుతీగపాడు గ్రామంలో పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, కొల్లూరి బాబు, బుద్దన ధనరాజు, దత్తు ప్రసాద్, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భీమవరం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుముదవల్లి రోడ్డులోని అల్లూరి రామకృష్ణంరాజు మునిసిపల్ హైస్కూల్ (ఏ.ఆర్.కే.ఆర్.) 2004-05 సంవత్సరం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారికి విద్య నేర్పిన గురువులను సత్కరించారు. గురువులు విద్యార్థులనుద్దేశించి ఎన్నో గొప్ప విషయాలను ఉపదేశించారు. అనంతరం విద్యార్థులు, గురువులు విందు వినోదాలు, ఆటపాటలతో గడిపారు.

## డ్రెయిన్‌పై ఆక్రమణల తొలగింపు



శృంగవృక్షంలో తొలగిస్తున్న ఆక్రమణలు

పాలకోడేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శృంగవృక్షం గ్రామంలోని శివాలయం వీధిలో డ్రెయిన్లపై కట్టడాలు నిర్మించి వ్యాపారం సాగించడం పట్ల డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదివారం సాయంత్రం ఆగ్రహం వ్యక్తం చేసి ఆక్రమణలు తొలగించాలంటూ పంచాయతీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో స్పందించిన సర్పంచ్ జంగం నూరిబాబు, సీనియర్ టీడీపీ నాయకుడు కలిదిండి కృష్ణంరాజు ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది సోమవారం ఆక్రమణలను తొలగించారు.

# తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి

### ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



తణుకులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలక్ష్మి

పాలకోడేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పార్వతి, సూర్యకుమారి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, అలాగే తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని తెలిపారు. అనంతరం తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

**నరసాపురం టౌన్:** తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఆర్డీవో దాసిరాజు అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తల్లిపాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రక్షణగా నిలుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఊర్మిళ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

**ఆకివీడు:** ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వాణి విజయ రత్నం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం దగ్గర తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో మార్కండేశ్వరరావు, వెలుగు ఏపీఎం సుహాసిని, విద్యుత్ ఏఈ రత్నాకర్ తదితరులచే తల్లిపాల ప్రాముఖ్యత గోడ పత్రిక ఆవిష్కరించారు.

**తణుకు రూరల్:** పుట్టిన బిడ్డకు తల్లిపాలు దివ్య ఔషధమని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం. శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తల్లిపాల అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్న పిల్లలకు తల్లిపాల ద్వారానే పోషకాలు అందుతాయని, వాటి ద్వారా భవిష్యత్‌లో పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, డిప్యూటీ ఎంపీడీవో పీవీవీరామ్ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సీహెచ్ వెంకట లక్ష్మి, ఎం.అరుణ కుమారి, వి.కృష్ణ కుమారి పాల్గొన్నారు.

**ఇరగవరం:** ఇరగవరం, తూర్పువిప్పర్రులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ మమత మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మానిక్యాంబ, మహాలక్ష్మి పాల్గొన్నారు.



నరసాపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో దాసిరాజు

**పెనుమంట్ర:** తల్లిపాలతో బిడ్డల ఆరోగ్యానికి రక్షణ అని తహసీల్దార్ వై. రవికుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి చెప్పే పోస్టర్స్‌ను విడుదల చేశారు. మండల అధికారులు అందరికీ తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా, తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి, బిడ్డకు మంచి అనుబంధం ఏర్పడుతుందని, బిడ్డ పుట్టిన అరగంటలోపు తప్పనిసరిగా ముర్రుపాలు తాగించాలని, దానివల్ల బిడ్డల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఎ.కృష్ణకుమారి, ఎంపీడీవో ఎంఎస్ ప్రభాకరరావు, డిప్యూటీ తహసీల్దార్ ఏలియమ్మ, ఈవోపీఆర్డీ వల్లభు రాంబాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యల్ ఏసు రాణి పాల్గొన్నారు.

## పాలకొల్లులో అభివృద్ధి పనుల పరిశీలన

పాలకొల్లు టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు నియోజకవర్గంలో వైసీపీ పాలనలో అభివృద్ధిపై ఆ పార్టీ నాయకులు దృష్టి పెట్టలేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ముస్లిం షాదిఖానా, సమతా మహిళా సంఘ భవనం, టిడ్కో ప్రాంతంలో వంతెన, బస్‌షెల్టర్, మూడో వార్డులో కమ్యూనిటీ హాలు,బ్రాడిపేటలో తూర్పు కాపుల కల్యాణ మండపాలను పరిశీలించారు. చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ విజయ్ సారథి, రాష్ట్ర సెక్రెటరీ బాబు, పాలకొల్లు పట్టణ అధ్యక్షుడు జీవీ మహ్మద్ జాని, దనానా సూర్య ప్రకాష్, పొట్నూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రామాలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పోలవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాతపోలవరం గ్రామంలో పురాతన రామాలయ పునర్నిర్మాణానికి సోమ వారం దాతలు విరాళం అందజేశారు. భీమవరం మండ లం తాడినాడ గ్రామానికి చెందిన దాత గాదిరాజు శరత్ రాజు, సుకన్య దంపతులు రూ.50 వేలు, వైజాగ్ వాసులు గోలి గణేశ్ దంపతులు రూ.25 వేలు ఆలయ కమిటీ సభ్యులు దేవాబత్తుల నాగదేవికి అందజేశారు. దాతల విరాళాలతో కలిపి రూ.2 లక్షలను ఆలయ పునర్నిర్మాణానికి ఉపయో గించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సూరవరపు వీరన్న, బొడ్డు రాంబాబు, గుల్లిపల్లి శివ, దేవాబత్తుల నాగరాజు, దేవాబత్తుల రాంబాబు, పట్నాల నారాయణరావు, సూరవరపు తాతయ్య, అప్పారావు, సూరి బాబు, సురేష్, కిరణ్, రంగా అయ్యప్ప పాల్గొన్నారు.

## కవి బాలచందర్‌కు సత్కారం



పెనుగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మానవత కార్యవర్గ సమావేశంలో ప్రముఖ కవి, మానవత పూర్వ అధ్యక్షుడు డాక్టర్ బాల చందర్‌ను సాహితి విజ్ఞాన జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. మానవత విశిష్టతను చాటి చెప్పడమే కాక అడ్వైయిజరి బోర్డు మెంబరుగా మానవత పూర్వ అధ్యక్షులుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నందుకు గాను బాల చందర్‌ను ప్రశంసిస్తూ సత్కరించారు. వ్యవస్థాపకులు ఎస్ రామచంద్రారెడ్డి, జిల్లా కన్వీనర్ గంగాధరరావు, కో ఆర్డినేటర్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కండెపు వెంకట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అగస్తేశ్వర ఆలయ ట్రస్ట్‌బోర్డు ప్రమాణ స్వీకారం



పెనుమదం దేవస్థానం చెర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తంగెళ్ల సత్యనారాయణను అభినందిస్తున్న నాయకులు

పోడూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెనుమదం ఉమాఅగస్తేశ్వరస్వామి దేవాలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్‌గా తంగెళ్ల సత్యనారాయణ, మరో 9మంది ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈవో పిల్లి సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాలకొల్లు ఏఎంసీ చెర్మన్ కోడి విజయభాస్కర్, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, పెనుమదం నీటిసంఘం అధ్యక్షుడు దేవరపు దొరబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కడలి ఆంజనేయులు, దేవస్థానం మాజీ ఛైర్మన్ దేవరపు వీరరాఘవులు మాష్టారు పాల్గొన్నారు.



పెనుగొండ పంచాయతీ సాధారణ సమావేశ దృశ్యం

## పెనుగొండ పంచాయతీలో 35 తీర్మానాలు ఆమోదం

పెనుగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ అజెండాలో ప్రవేశపెట్టిన 35 తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, సభ్యులు బాలం కనక దుర్గ, చేవూరి శ్రీదేవి, కాకి బాల వెంకట సత్య ప్రభాకర్, వేండ్ర మంగ, పులుగోరు రవి కుమార్, బండారు కృష్ణమూర్తి, మండా సత్య సూర్య ప్రసాద్, దొమ్మేటి దేవి, పూతినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 5జీ సెల్‌ఫోన్‌లు ఇవ్వాలి

మొగల్తూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తమకు 5జీ సెల్‌ఫోన్‌లు ఇవ్వాలంటూ అంగన్‌వాడీలు సోమవారం సీడీపీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తమకు గతంలో ఇచ్చిన 2జీ సెల్‌ఫోన్‌లతో యాప్ వర్క్‌లు చేయలేకపోతున్నామని, ఇందుకు అనుగుణంగా రాష్ట్ర డైరెక్టర్ 5జీ ఫోన్‌లు ఇచ్చేందుకు హామీ ఇచ్చి 5 నెలలు గడుస్తున్నా నేటికి ఇవ్వలేదన్నారు. 2జీతో నెట్, సర్వర్లు కలవక, కనీసం ఓటిపిలు కూడా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.